క్లుప్తంగా

పంటల సాగుపై అవగాహన



ఫీల్డ్ విజిట్ చేసిన శాస్త్రవేత్త, రైతులు

జహీరాబాద్‌టౌన్: పంటల సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణ, ఎరువుల వాడకంపై చెరకు రైతులకు రాయికోడ్ గోదావరి–గంగా అగ్రో ప్రొడక్షన్ లిమిటెడ్ చెక్కర కర్మాగారం యాజమాన్యం అవగాహన కల్పించారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్, మద్రి గ్రామ రైతులకు మంగళవారం క్షేత్రపదర్శన ద్వారా అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త సురేశ్ మానే పాటిల్ మాట్లాడుతూ.. చెరకు సాగులో ఆధునిక పద్ధతులు అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. సమయానికి నీటి తడులు, ఎరువులు, పురుగు మందులను సరైన మోతాదులో వాడాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రామలింగారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ కుపేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రేపు నిధి ఆప్కే నికత్ 2.0

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న నిధి ఆప్కే నికత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు కేంద్రాల్లో శిబిరాలను ఉ. 9:30 నుంచి సా. 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ బాచుపల్లి.. బౌరంపేట సమీపంలోని అంబిటస్ వరల్డ్ స్కూల్, రామచంద్రపురం పరిధిలోని మాతేసిన్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, జహీరాబాద్ అల్గోల్ రోడ్డులో అల్లన కన్స్యుమర్‌లో, హైదరాబాద్ గచ్చిబౌలిలో సరోవర్ హోటల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, మెదక్ తూప్రాన్ మండలం సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో భవిష్యనిధి శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా అధికారులు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఉత్సవ నిర్వాహకులు ప్రతీ కమిటీని రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ దుర్గారెడ్డి, ఎంపీఓ సుభాష్, విద్యుత్ ఏఈ శోభా, మండలంలోని పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



పూల మొక్కలు పంపిణీ చేస్తున్న వీరన్న

సదాశివపేట(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణంలోని 9వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి మఠం వీరన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని 9వ వార్డులో ఇంటింటికి పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను పెంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి శివానందస్వామి, బిల్ కలెక్టర్ సాయికుమార్, ఆర్పీ కల్పనాగౌడ్, సునీతారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట మండలం ఖానాపూర్(బి) గ్రామానికి చెందిన ఈర్ల రామవ్వకు ఆస్పత్రి ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.24 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కును మంగళవారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు బలరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు. మనూరు మండలం బోరంచకు చెందిన గాలప్పకు రూ.60 వేల చెక్కును యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సాగర్ షెట్కార్ అందజేశారు. మాజీ సర్పంచ్ నారాయణ, నాయకులు శాంతప్ప పాల్గొన్నారు.


గణనాథుడి పూజకు వేళాయె

ముస్తాబైన మండపాలు
- చిన్న పొరపాట్లతో ప్రాణాలకు ముప్పు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి క్రైమ్: వినాయక చవితి సందడి షురూ అయ్యింది. చిన్నాపెద్దా కలిసి జరుపుకొనే గణపతి నవరాత్రి ఉత్సవాలకు సంగారెడ్డి పట్టణం సిద్ధమైంది. బుధవారం గల్లీగల్లీలో వినాయక విగ్రహాలు ఏర్పాటుకు నిర్వాహకులు మండపాలను అలంకరిస్తున్నారు. పూజా సామగ్రి, వినాయకుల కొనుగోలుతో మార్కెట్లు సందడిగా మారాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళలో భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నారు. విగ్రహాలను వివిధ రూపాల్లో.. 500 నుంచి లక్ష యాభై వేల పెట్టి కొనుగోలు చేసి ప్రతిష్ఠించనున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

చిన్నచిన్న పొరపాట్లే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుంది. విద్యుత్ సరఫరా, భారీ సౌండ్ సిస్టంలతో ప్రాణాలు పోయే పరిస్థితులు ఉన్నాయి. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద కరెంటు వైర్లు తగలడం, వాహనాలపై కూర్చున్న వారు షాకుకు గురై ప్రాణాలు కోల్పోతారు. జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. చెరువులో నిమజ్జనాలు చేసే క్రమంలో ఎక్కువ లోతుకు వెళ్లకుండా కొద్ది దూరంలోనే నిమజ్జనం చేయాలి. మండపాలలో రాత్రిపూట కమిటీ సభ్యులు కాపలా ఉండాలి. పోలీస్‌లతో సమన్వయంగా ఉంటూ జాగ్రత్తలు పాటిస్తూ నవరాత్రులను పూర్తి చేయాలి.



పట్టణంలో ఏర్పాటు చేసిన మండపం



కొనుగోళ్లకు వినాయక విగ్రహాలు



పూలు, పత్రీ కొనుగోలు చేస్తున్న మహిళలు

శాంతియుతంగా పండగ జరుపుకోవాలి



వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, ప్రజలు సహకరించాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ కోరారు. ఈ నేపథ్యంలో ఆయన సాక్షితో మాట్లాడారు. పట్టణంలో ఈసారి 200 పైగా మండపాలు పోలీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వినాయక చవితి వేడుకల్లో ఆటంకాలు కలగకుండా ఆర్డీఓ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పని చేస్తున్నాం. భారీ గణపతుల విగ్రహాలను తీసుకొచ్చేటప్పుడు తమకు సమాచారం ఇస్తే పోలీసులు సహకారం అందిస్తాం.

– సత్తయ్య గౌడ్, సంగారెడ్డి డీఎస్పీ



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గాంధీ పార్క్ సమీపంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీకి ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా చెరువులను కాలుష్యం నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పట్టణంలోని సాకి చెరువులో చేపడుతున్న నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, గజ ఈతగాళ్లు, క్రేన్లతో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గాంధీ సర్కిల్ నుంచి గోనెమ్మ దేవాలయం వరకు చేపడుతున్న రహదారి విస్తరణ, సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారిని విస్తరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధి పాతకాలనీలో నూతన సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

వట్‌పల్లి(అందోల్): వసతిగృహాల్లోని సిబ్బంది విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దేవునూర్ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతులు, రికార్డులను పరిశీలించారు. వసతి గృహంలో సరైన వసతులు లేకపోవడం, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వసతిగృహంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని తాలెల్మ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణకు సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ అంజయ్య ,ఎంపీఓ ఖజానాసిరోద్దీన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుంటే కాంట్రాక్ట్ రద్దే

రోడ్డు నిర్మాణాల పేరిట అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. వట్‌పల్లిలో రోడ్డు విస్తరణ పనులకు మైనింగ్ శాఖ అనుమతి లేకుండా కాంట్రాక్టరు ప్రభుత్వ భూమిలో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టి అక్రమంగా మట్టి తరలించడంపై ఈనెల 25న 'సాక్షి'దిన పత్రికలో 'మట్టి..కొల్లగొట్టి'శీర్షికతో కథనం ప్రచురితమైంది. మంగళవారం అదనపు కలెక్టర్ వట్‌పల్లి పర్యటన సందర్భంగా స్థానికులు 'సాక్షి'కథనాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా.. వెంటనే అక్కడే ఉన్న తహసీల్దారు చంద్రశేఖర్‌ను పిలిచి మట్టి తరలింపుపై వివరాలను అడి గారు. రోడ్డు నిర్మాణానికి తానే అనుమతి ఇచ్చానని చెప్పగా ఎన్ని ట్రిప్పులకు ఇచ్చారని అదనపు కలెక్టర్ ప్రశ్నించగా తహసీల్దారు నీళ్లు నమిలారు. దీంతో అదనపు కలెక్టర్ ఆర్‌అండ్‌బీ ఈఈకి ఫోన్‌చేసి విచారణ చేపట్టి రిపోర్టు చేయాలని ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సునీత

జహీరాబాద్: కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు సబ్సిడీల గురించి ఉద్యానవన శాఖ అధికారి సునీత అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ పథకం ద్వారా రైతులకు ఎకరానికి రూ.50వేల వరకు సబ్సిడీ అందించనున్నట్లు చెప్పారు. పంటను కొనేందుకు గోద్రేజ్ కంపెనీ వారు మండలంలో కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారని వివరించారు. అనంతరం అల్లం పంట సాగును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సవిత, ఉద్యాన విస్తరణ అధికారి సతీశ్, డ్రిప్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠించే ప్రతిమలను పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కమలాపూర్ చెరువులో నిమజ్జనాలు చేస్తారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ప్రమాదాలు జరగకుండా అవసరమైన ఏర్పాట్ల విషయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఖేడ్, మనూరు ఎస్సైలు విద్యాచరణ్ రెడ్డి, కోటేశ్వరరావు, శానిటరీ అధికారి శ్రీనివాస్ చెరువు పరిసరాలను పరిశీలించారు.



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్, పోలీసులు

యూరియా కోసం అవస్థలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం ఆగ్రో సేవా కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. ఆగ్రో సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని రైతులు వాపోయారు. యూరియా సరఫరాలో ప్రభుత్వాలు సరైన సమయంలో స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతన్నకు యూరియాను సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతన్నకు దుఃఖం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుకాణాల వద్ద రైతుల రద్దీ

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నారాయణఖేడ్: కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై దాడికి నిరసనగా మంగళవారం ఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నర్సింహారావు, మారుతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, భగవాన్‌రావు, సుధాకర్, విష్ణు, రాజు, కిషన్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

డీఈఓ వెంకటేశ్వర్లు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి.. వృత్తిలో ఉన్నప్పుడు చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని డీఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఉమారాణి పదవీ విరమణ సభకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. విరమణ తరువాత కుటుంబంతో ఆనందంగా గడపడంతో పాటు శేష జీవితాన్ని మంచిగా మలచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, జీహెచ్ఎం అధ్యక్షుడు సంజీవరావు, జనరల్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఉమారాణి దంపతులను సన్మానించిన డీఈఓ, ఉపాధ్యాయులు

మొక్కలు నాటి కాపాడుకోవాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 31,32 వార్డుల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వార్డు ప్రజలకు ఎమ్మెల్యే మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయకండి

న్యాల్‌కల్(జహీరాబాద్): సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి గోవిందరాం సూచించారు. మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియెట్ దశ కీలకమైందని విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ఫరిదా అస్మా, వెంకటేశం,అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై రైతుల ఆగ్రహం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీ సమీపంలోని సర్వే నంబర్1లో గుట్టు చప్పుడు కాకుండా పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్నారని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మట్టి తరలింపును అడ్డుకున్నారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చిన తమకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని న్యాయం జరిగే వరకూ మట్టి తరలింపు చేపట్టొదని హెచ్చరించారు. మైనింగ్ రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి మట్టి తరలింపు ఆగడాలను అడ్డుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. కొంతకాలంగా ఈ భూముల్లో నుంచి పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలను జరుపుతూ గడ్డపోతారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి తమకు పరిహారం అందించేంత వరకు మట్టి రవాణా చేయొద్దని బాధిత రైతులు వాపోతున్నారు.



మట్టి తరలింపును అడ్డుకున్న బాధిత రైతులు

ప్రమోషన్‌లో రిజర్వేషన్‌లు కల్పించాలి

జహీరాబాద్ టౌన్: పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రిజర్వేషన్ కల్పించాలని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నిమ్మల కిష్టయ్య డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడి కోసం మంగళవారం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో టీచర్లు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. ప్రమోషన్‌లో రిజర్వేషన్ కల్పించి షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. జీఓ నం 2ను రద్దు చేసి జీఓ నం 5ను అమలు చేయాలన్నారు.



హైదరాబాద్‌కు వెళ్తున్న ఉపాధ్యాయులు

మట్టి విగ్రహాల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం కళాశాల వద్ద ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను తయారు చేసుకొని పూజించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మురళీ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సిద్దులు, అధ్యాపకులు ఉన్నారు.

మట్టి వినాయకుల తయారీ

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. పోటాపోటీగా మట్టి వినాయక విగ్రహాల తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మట్టి వినాయకులను చేసి చూపుతున్న విద్యార్థులు

పాఠశాల హెచ్ఎం,ఉపాధ్యాయులు పర్యావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వినాయక చవితి సందడి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో మంగళవారం వినాయక చవితి సందడి నెలకొంది. వాడవాడలా వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు యువకులు నిమగ్నమయ్యారు. వినాయకుని పూజకు అవసరమైన పూలు, పూజా సామగ్రి, తుమ్మికూర చింతకాయ, కూరగాయలు పండుగకు అవసరమైన ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు వస్తున్న ప్రజలతో పట్టణంలోని గాంధీచౌక్ సందడిగా మారింది.

మట్టి విగ్రహాలతో మేలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయకులను తయారుచేసి పూజలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. చవితి నవరాత్రోత్సవాల్లో మట్టి వినాయకులు తయారు చేసుకొని పూజించాలని కోరారు.

9 రోజులకు నిమజ్జనం

జహీరాబాద్: పట్టణంలో ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహాలను 9 రోజులకు నిమజ్జనం చేయాలని సార్వజనిక్ ఉత్సవ కమిటీ నిర్ణయించింది. మంగళవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ సుభాష్‌రావు, డీఎస్పీ సైదా, సార్వజనిక్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 4న నిమజ్జనం చేసేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులను కోరారు.

జోగిపేటలో పీస్‌కమిటీ సమావేశం

జోగిపేట(అందోల్): అందోలు మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని జోగిపేట ఎస్ఐ పాండు సూచించారు. మంగళవారం నిర్వహించిన పీస్‌కమిటీ సమావేశానికి హాజరై వినాయక మండప నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడారు. వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి లేనిదే ఎలాంటి సౌండ్ బాక్స్‌లను ఉపయోగించొద్దన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ

కంగ్టి(నారాయణఖేడ్): 13న ఖేడ్ కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని అన్నీ గ్రామాలకు చెందిన వారు లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్, గొడవలు, చీటింగ్, చిట్‌ఫండ్, భూవివాదాల కేసులు, భార్యాభర్తల కేసులు, చిన్నచిన్న దొంగతనాల కేసులు, ఇసుక, మట్టి, కట్టెలు, మద్యం తదితర అక్రమ రవాణా కేసులు, పేకాట కేసులు ఇరు పక్షాల సమ్మతంతో రాజీ చేసుకొనే అవకాశం ఉందన్నారు. 28 నుంచి సెప్టెంబర్ 13లోగా రాజీమార్గంతో కేసులు తొలగించుకోవాలని సూచించారు.

◆ పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): వినాయక చవితి, ఈద్ మిలాద్ ఉన్ నబి పండుగ వేడుకలు కలిసి మెలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై–2 నారాయణ సూచించారు. మంగళవారం ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌లో శాంతియుత సమావేశం నిర్వహించారు. కులమతాలకతీతంగా పండుగలు కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు.

◆ ఔషధ గని.. తుమ్మి

జహీరాబాద్ టౌన్: వినాయక చవితికి జహీరాబాద్ ప్రాంతంలోని ప్రతి ఇంట్లో తప్పక తుమ్మికూరను వండుతారు. పండుగ రోజు ఇక్కడి ప్రజలు పప్పులో వేసుకుని వండి ఇష్టంగా తింటారు. తుమ్మికూర పప్పు చాలా రుచిగా ఉంటుంది. దీనితో పాటు మరికొన్ని ఆకుకూరలు కూడా వండుకుని తింటారు. ప్రజలు మంగళవారం తుమ్మికూరను కొనుగోలు చేశారు. ఔషధ గనిగా పిలువబడే తుమ్మికూరను రూ.15 కట్ట చొప్పున విక్రయించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పొలాల నుంచి కోసుకుని వచ్చి ఆకుకూరను మార్కెట్‌లో విక్రయించారు.

◆ రేషన్ కార్డుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. వార్డుకు 180 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా కొత్తగా కొంత మంది పేర్లను చేర్పించారు. మాజీ కౌన్సిలర్ రాములు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసినందుకు ఎంపీ సురేష్‌షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటకిషన్ రావు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.